పండగలకూ పప్పన్నం కరువాయె!

- రేషన్ లబ్ధిదారులకు అందని కందిపప్పు
- ధరాఘాతంతో పేదల వస్తులు



కార్డుదారులకు అందని కందిపప్పు



రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

దెందులూరు: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిలిచిన కందిపప్పు పంపిణీ ఈ నెల, వచ్చే నెల అంటూ వాయిదాలు వేస్తూనే ఉన్నారు. దసరా, దీపావళి పండగల సమయంలో కూడా పంపిణీ చేయని వైనం. రాష్ట్రంలో 15 నెలల కూటమి పాలనలో ప్రజలు విసిగిపోయారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు చూసి తమ బతుకులు మారతాయని భ్రమించి, ఓటేసి తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. కూటమి పాలనలో సామాన్యుడి బతుకు కష్టంగా మారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతినెలా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపేణా ఆర్థికంగా లబ్ధి కనిపించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నగదు బదిలీ, సంక్షేమ పథకాలు పూర్తిగా అటకెక్కాయి. అదే విధంగా ఎప్పటి నుంచో అమలులో ఉన్న నిత్యావసర సరుకుల పంపిణీ విధానం దాదాపుగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది.

మండలంలో 18,441 రేషన్‌కార్డులు

దెందులూరు మండలంలో 20 గ్రామాలకుగాను 18,441 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి 46 డిపోల ద్వారా సరుకులు అందిస్తున్నారు. ప్రతి నెలా మండలంలో లబ్ధిదారులకు 228.502 మెట్రిక్ టన్నుల బియ్యం, 10 క్వింటాళ్ల పంచదార, 20 క్వింటాళ్ల కందిపప్పు అవసరం ఉంటుంది. గత 15 నెలలుగా కందిపప్పు రేషన్ షాపుల్లోకి రావటం లేదు. రేషన్ డిపోల్లో గతంలో కందిపప్పు కిలో రూ.68 చొప్పున ఇచ్చేవారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర ప్రస్తుతం రూ.140 నుంచి రూ.180 పలుకుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఇంత ధర వెచ్చించి, కొనలేని పరిస్థితి కనిపిస్తోంది.

గతంలో ఇంటి వద్దకే రేషన్



వైఎస్సార్ సీపీ ఐదు సంవత్సరాల పాలనలో రేషన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే బియ్యం, పంచదార, కందిపప్పు అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ సరుకుల్లో కందిపప్పుకు కోత విధించింది. పంచదారనూ అరకొరగా ఇస్తోంది. పంచదార ధర బయట మార్కెట్‌కు రేషన్ షాపుల వద్ద పెద్దగా తేడా ఉండడం లేదు. రేషన్ డిపోల ద్వారా అయినా తీసుకుందామంటే ఇక్కడ అసలు పంపిణీయే లేదు. సామాన్యుడికి పప్పన్నం అందని ద్రాక్షగా మారింది.

–జ్యోతి, గృహిణి దెందులూరు

రేషన్ దుకాణాల్లో కంది పప్పు ఇవ్వాలి



బయట నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రేషన్ డిపోల ద్వారా బియ్యం మాత్రమే కాకుండా గతంలో మాదిరిగా కందిపప్పు, వంటనూనె, రాగి పిండి వంటివి రాయితీపై అందించాలి. నెలనెలా కందిపప్పు ఇప్పించే ఏర్పాటు చేయాలి.

–కె.కృష్ణవేణి పంచాయతీ వార్డు మెంబర్ దెందులూరు

బియ్యం మాత్రమే ఇస్తున్నారు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారు. పంచదార అప్పుడప్పుడు మాత్రమే అదీ గట్టిగా అడిగితే ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటికి వచ్చి మరీ బియ్యం, పంచదార, కందిపప్పు ఇచ్చేవారు. ఇప్పుడు ఒక్క నెల కూడా కందిపప్పు ఇవ్వలేదు. భవిష్యత్‌లో ఈ బియ్యం కూడా ఇస్తారో..ఆపేస్తారో తెలియడం లేదు.

–అంగడాల సీతారావమ్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు, దెందులూరు

ప్రభుత్వం సరఫరా చేయడం లేదు

కందిపపప్పు సివిల్ సప్లై గొడౌన్‌లకు ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. అందుకే రేషన్ డిపోలకు రావడం లేదు. ప్రభుత్వం నుంచి గొడౌన్‌లకు వస్తే రేషన్ డిపోలకు సరఫరా చేసి, లబ్ధిదారులకు అందిస్తాం. ప్రస్తుతానికి బియ్యం, పంచదారను అందిస్తున్నాం

–డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై, దెందులూరు

క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: చిన్నారులకు తల్లిదండ్రులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ సబ్ సెంటర్లలో చిన్నారులకు టీకాలను వేయించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తల్లులకు శాఖపరమైన సూచనలు చేసి అవగాహన కల్పించారు.

అయ్యప్ప స్వాములు, భవానీలకు భిక్ష



స్వాములకు, భవానీలకు భిక్ష పెడుతున్న ఆలయ కమిటీ

దెందులూరు: కొవ్వలి గ్రామం కొత్తపేటలో వేంచేసియున్న అభయ ఆంజనేయస్వామి గుడి వద్ద అయ్యప్ప స్వాములు, భవానీమాలధారులకు, భక్తులకు అభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ గ్రామస్తుల సహకారంతో ప్రతిరోజూ బిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములు భవానీమాలధారులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెలలు తరబడి స్పందించరా?



నేలకొరిగిన భారీ వృక్షం

దెందులూరు: దెందులూరు నుంచి ద్వారకాతిరుమల వెళ్లే మార్గంలో శ్రీరామవరం సమీపంలో రోడ్డు పక్కన వృక్షం ఆయిల్‌పామ్ తోటలో మొక్కలపై పడింది. గత నెలలో కురిసిన ఈ భారీ వర్షాలు ఈదురుగాళ్లకు ఈ వృక్షం పడిపోయింది. సంబంధిత శాఖల అధికారులు వృక్షాన్ని తొలగించకపోగా ఆయిల్ పామ్ రైతుకు మీరు తొలగించుకోండని చెప్పకపోవడంపై బాధ్యత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

17న నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన పుంతలో ముసలమ్మ ఆలయం

దెందులూరు: చల్లచింతలపూడి గ్రామం కొత్త కమ్మవారిగూడెంలో దాత కమ్మ నరేంద్ర రత్న మాణిక్యం దంపతులతో పాటు గ్రామస్తుల ఆర్థిక సాయంతో నిర్మించిన పుంతలో ముసలమ్మ అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 17న ఉదయం 11.52 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్ఠ పూజలు అనంతరం ఆలయ ఆవరణలో అన్నమహా సమారాధన నిర్వహిస్తామన్నారు.

రైతులకు నాణ్యమైన గోనె సంచులు అందించాలి



గోనె సంచులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: సార్వా పంట కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లర్లు నాణ్యమైన గోనె సంచులను సరఫరా చేయాలని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు, పూళ్ల గ్రామాల్లో రైస్ మిల్లులను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుసేవా కేంద్రాలకు సరఫరా చేయనున్న గోనె సంచులను ఆమె పరిశీలించారు. సంచుల విషయంలో రైస్‌మిల్లర్లకు పలు సూచనలందించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిదన్నారు. చిరిగిన సంచులను ఇస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ జి.భరత్‌కుమార్, ఆర్ఐ జగన్నాధం, వీఆర్వోలు వెజ్జు వినయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రీసర్వే పనులు

ఉంగుటూరు: గ్రామాల్లో సర్వే పనులు ప్రభుత్వం ముమ్మరంగా నిర్వహిస్తోంది. ప్రధానంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేస్తున్నారు. భూమి ఉపరితలాన్ని అనుసరించి పూర్వం 1932లో చేసిన సర్వేకి ఇప్పటికీ తేడాలు ఏమైనా ఉంటే గుర్తించి రాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. ప్రస్తుతం మండలంలోని బాదంపూడి, చేబ్రోలు, గోపీనాథపట్నం గ్రామాల్లో సర్వే పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు దొంతవరం, తల్లాపురం, విఎ పురం, చేబ్రోలు ఖండ్రికల్లో సర్వే పనులు పూర్తి చేసినట్లు తహసీల్దార్ పూర్ణ చంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆగుతున్న ప్రగతి రథచక్రాలు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



నడిపల్లిలో బస్సు మొరాయించడంతో వేరే బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పెదవేగి: నిరంతరం ఏలూరు–చింతలపూడి మార్గంలో బస్సులు ఆగిపోతున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చింతలపూడి నుంచి బయలుదేరిన ఏలూరు సర్వీస్ పెదవేగి మండలం నడిపల్లి వద్ద ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యాలను చేరడానికి నానా అవస్థలు పడ్డారు. కాలం చెల్లిన బస్సులను డ్రైవర్లకు ఇచ్చి పంపుతున్న అధికారులు కనీసం బస్సు ఏ స్థితిలో ఉందో తెలియకుండా తిప్పుతుండడంతో రాత్రీ, తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ ఆగుతున్న బస్సులతో మేము పడలేకపోతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం ఇదే తంతని, ఉచిత బస్సు ఇచ్చి ఇలా మొరాయించే బస్సులు తిప్పడం సరికాదని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే మంచి బస్సులన్నీ కర్నూలు మోదీ సభకు వెళ్లాయని, ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు.

కొనసాగుతున్న ఇన్‌చార్జిల ఏలుబడి

దెందులూరు: మండలంలో ప్రధాన పోస్టులు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రభుత్వం కొత్త నియామకాలు, బదిలీలు చేపట్టకపోవడంతో నెలలు తరబడి ఇన్‌చార్జిలతోనే సాగుతున్నాయి. ఇన్‌చార్జి బాధ్యతలతో ఏ పోస్టుకూ న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో వైపు ఒక పోస్టులకు సంబంధించి వర్క్ అధికంగా ఉంటున్నప్పటికీ అదనంగా మరో పోస్ట్ చేయాలంటే పని ఒత్తిడి తలకు మించిన భారం అవుతుందని ఇన్‌చార్జి బాధ్యతలు చేస్తున్న ఉద్యోగులు వాపోతున్నారు. సీడీపీఓ, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ దెందులూరు సీహెచ్‌సీలో మూడు వైద్య పోస్టులు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్, ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీ పోస్టులు గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో అధ్యాపకులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: హృదయ స్పందన నిలిచిపోయిన తరుణంలో సీపీఆర్ అత్యవసర వైద్య ప్రక్రియ అని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పూళ్ల ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని పూళ్ల వెల్‌నెస్ కేంద్రం నంబర్–2 వద్ద బుధవారం కార్డియో పల్మనరీ రెసిటేషన్(సీపీఆర్)పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృదయ శ్వాస కోశ పునరుజ్జీవన చర్యపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు, మెదడు, ఇతర ముఖ్య అవయవాలకు రక్త ప్రసరణ నిలిచినప్పుడు ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న తరుణంలో ఇది చేస్తారన్నారు. మొదటి 30 నిమిషాలు గోల్డెన్ ఘడియలు అని, ఈ సమయంలో చెప్పిన ప్రక్రియను చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ జి.శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి, లలిత, ఎంఎల్‌హెచ్‌పీ పి.నందిని, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సొంగా రవీంద్రప్రసాద్



రవీంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్వేయర్లు

దెందులూరు: ఏపీ సీఆర్‌డీఏ అసిస్టెంట్ డైరెక్టర్‌గా దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన సొంగా రవీంద్రప్రసాద్ బుధవారం ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ సర్వేయర్లు దుర్గాప్రసాద్, ఉస్మాన్, మురళి, హబీబ్, మనోహర్, ఫరీద్, ఉద్యోగులు నూతన అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఉంగుటూరు: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు బుధవారం విజ్ఞప్తి చేశారు. గొల్లగూడెం రజకులు విశ్రాంతి షెడ్డు నిర్మించాలని కోరారు. నియోజకవర్గం నలుమూలల నుంచి జనం సమస్యలపై వచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు.

జీవన ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్

పెదవేగి: రైతులు పంటలకు రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సర్పంచ్ పరాశరం భాస్కర్ దీక్షితులు అధ్యక్షతన గ్రామ వ్యవసాయ సాగు భూమి, భౌగోళిక పరిస్థితులు, భూసారాన్ని రైతులు పండించవలసిన పంటలు, దిగుబడులపై కొప్పాక గ్రామ రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఫణికుమార్, పెదవేగి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవన ఎరువుల వలన పెట్టుబడిలో 20 శాతం తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. అంతేకాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చని తెలియజేశారు. అలాగే అధిక దిగుబడులు సాధించొచ్చని వివరించారు. కావున రైతులు జీవన ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో రైతు సాంబశివరావు, రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మానస, చంద్రిక, సౌజన్య, సౌమ్య, సృజన, సుష్మ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవాలి



రహదారిపై భారీ గుంతను పూడ్చుతున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు గల రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై సాక్షిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నెల 12వ తేదీన అదమరిస్తే..అంతే సంగతులు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పలుసార్లు రోడ్డు గుంతలను పూడ్చాలని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులను కోరగా సానుకూలంగా స్పందిస్తున్నారే తప్ప మరమ్మతులు చేయట్లేదు. దీంతో చేసేదేమీ లేక కూటమి నాయకులు స్వచ్ఛందంగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. భీమడోలులోని దేవీ హస్పటల్ వద్ద భారీ గుంతను పూడ్చారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చూపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ప్రత్తి మదన్, పెద్దలు దొలారి సునీల్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, పంతం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి భద్రతపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

దెందులూరు: ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా దీపావళి పండుగను సంతోషంగా కుటుంబ సభ్యులతో నిర్వహించుకోవాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సోమవరప్పాడు బైపాస్ జంక్షన్ వద్ద దీపావళి భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. టపాకాయలు రోడ్లపై కాల్చకూడదన్నారు. పోలీస్ సిబ్బంది ఈ సూచనలను ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో దెందులూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న పూజారి

భీమడోలు: భీమడోలు అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో మాలధారులు పూజలు చేశారు. ఆలయంలో గణపతి, మురుగన్, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు విశేష పంచామృత, సుగంధ, నారికేళ, అభిషేకాలను ప్రత్యేక పూజలు చేసారు. గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మాలధారణ గావించారు. వారంతా స్వామియే శరణమయ్యప్ప అంటూ సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో పూజారి, భక్తులు పాల్గొన్నారు.

17న సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.భీమరాజు తెలిపారు. ఎంపీటీసీలు అధికారులకు సమాచారం అందించామని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం



భీమడోలు: అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



దెందులూరు: అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న బీఆర్‌డీ నర్సింగ్ విద్యార్థులు

భీమడోలు: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు.అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని బుధవారం భీమడోలు ఫొటోగ్రాఫర్ల యూనియన్, భీమడోలు శాఖా గ్రంథాలయాల్లో జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. భీమడోలు ఫోటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సంత మార్కెట్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పిల్లి బ్రహ్మారావు, ద్రాక్షారపు శ్రీరామ్, డి.డేవిడ్, పీవీఆర్ మూర్తి, దేవరపల్లి శ్రీనివాస్, ఏవీ నాగరాజు, చిన్ని, టీచర్ మండే సుధాకర్, గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శనీయులు

దెందులూరు: పేపర్ బాయ్ నుంచి భారత రాష్ట్రపతిగా ఎదిగిన ఏపీజే అబ్దుల్ కలాం భారతావనికి ఆదర్శప్రాయులని బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. బుధవారం నర్సింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం జీవన విధానాన్ని సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆయన సేవలను కొనియాడారు.